క్లుప్తంగా

దంత వైద్యశిబిరం ప్రారంభం

సుజాతనగర్: సుజాతనగర్ మండల కేంద్రంలో కొమరయ్య మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో డాక్టర్ శైలజ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్యశిబిరాన్ని టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు ఆదివారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా వైద్య సేవలందిస్తున్న డాక్టర్ శైలజను ఈ సందర్భంగా నాగా సీతారాములుతో పాటు పలువురు అభినందించారు.

రేపు ఉచిత రక్తదాన శిబిరం

పాల్వంచరూరల్: మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని యువసేన అనాథాశ్రమంలో మంగళవారం తలసేమియా పిల్లలకోసం ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు క్లీన్ అండ్ గ్రీన్ ఎర్త్ సొసైటీ అధ్యక్షుడు భట్టు కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీ స్థాపించి మూడేళ్ల పూర్తయిన సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా శిబిరాన్ని ఏర్పాటుచేయనున్నట్లు పేర్కొన్నారు. రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని, దాతలు 8074095948, 9705164828 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

గిరిజనులకు సోలార్ లైట్ల పంపిణీ

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలం పునుకుడుచిలక పంచాయతీ పరిధిలోని జీవలవాగు, చింతలమేరీ గ్రామాల్లో గిరిజన కుటుంబాలకు హ్యాపీ టూ హెల్ప్ యూ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం మిషన్ ఫర్ ట్రైబ్స్ అనే కార్యక్రమంలో భాగంగా సోలార్ లైట్లు, దుస్తులు, స్నాక్స్ అందించారు. భవిష్యతులో సహాయ సహకారాలు అందిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాస్, వినయ్, లేంటిల్ , మనీష్, రవితేజ, రామకృష్ణ పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఇల్లెందురూరల్: మండలంలోని ఇల్లెందు-మహబూబాబాద్ ప్రధాన రహదారిలో మామిడిగుండాల స్టేజీ వద్ద ఆదివారం పెను ప్రమాదం తప్పింది. గార్ల మండలం సీతంపేట గ్రామానికి చెందిన నలుగురు మహిళలు ఆటోలో ఇల్లెందు మండలం కొమ్ముగూడెం గ్రామంలో శుభకార్యానికి హాజరై తిరుగు ప్రయాణమయ్యారు. మామిడిగుండాల స్టేజీ మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఆటో అంచును ఢీకొట్టడతో ఆటో ముందు భాగం ధ్వంసమైంది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అందులో ప్రయణిస్తున్న నలుగురు మహిళలు క్షేమంగా బయటపడ్డారు. లారీ ఆటోను నేరుగా ఢీకొట్టినట్లయితే పెను ప్రమాదం జరిగి ఉండేదని, ఇరువురు డ్రైవర్లు అప్రతమత్తం కావడం వల్లే అందరూ క్షేమంగా ఉన్నారని స్థానికులు తెలిపారు.

ఎమ్మెల్సీపై ఆరోపణలు అర్థరహితం

ఇల్లెందురూరల్: ఎమ్మెల్సీ తాతా మధుపై అసమ్మతి కౌన్సిలర్లు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని బీఆర్ఎస్ పట్టణ కమిటీ అధ్యక్షుడు మనోహర్‌తివారి, ప్రధాన కార్యదర్శి పర్చూరి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యలయంలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. 2018 నుంచి నియోజకవర్గంలో జరిగిన ప్రతీ ఎన్నికకు పార్టీ అధిష్టానం ఎమ్మెల్సీ తాతా మధును ఇన్‌చార్జ్‌గా నియమించిందని గుర్తుచేశారు. ఆ సమయంలో ఆయన కృషితో కౌన్సిలర్లుగా గెలిచిన వారు నేడు ఆయనపైనే అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఇలాంటి ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో నాయకులు గుండా శ్రీకాంత్, అబ్దుల్ నబి, పాష, రాజేష్, వసంత్, రాచపల్లి శ్రీను, కంచర్ల నారాయణ, సతీష్, హరి, లాల్‌సింగ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేటీపీఎస్ సిబ్బందికి ఎమ్మెల్యే పరామర్శ

పాల్వంచ: కేటీపీఎస్‌లో జరిగిన విద్యుత్ ప్రమాదంలో గాయపడిన ఏఈ, ఇద్దరు ఆర్టిజన్ కార్మికులను ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఆదివారం హైదరాబాద్ యశోద హాస్పిటల్‌లో పరామర్శించారు. 7వ దశ నందు బ్రేకర్‌లను అమరుస్తున్న క్రమంలో గాయపడిన వారిని పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బాధితులకు అండగా ఉంటామన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతికి నివాళి

ఇల్లెందురూరల్: మండలంలోని రొంపేడు మాజీ ఎంపీటీసీ లావుడ్యా రాంబాబు (35) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. ఈ మేరకు రాంబాబు మృతదేహంపై జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో ఎంపీటీసీలు మండలరాము, పూనెం సురేందర్, గుగులోత్ నాగార్జున్, తాటి రాంబాబు, సాంబమూర్తి, సూర్యం నాయకులు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

మక్కల సాగుపై మక్కువ!





వెంగన్నపాలెంలో సాగు చేస్తున్న మొక్కజొన్న

- సుమారు 300 ఎకరాల్లో మొక్కజొన్న
- పత్తి, మిర్చిల్లో నష్టపోవడంతో ఆసక్తి

జూలూరుపాడు: ఈ ఏడాది యాసంగిలో రైతులు మొక్కజొన్న పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు ఇప్పటికే 250 ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న పంట సాగు చేయగా, ఈ సాగు విస్తీర్ణం సుమారు 300 ఎకరాలకు పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది అధిక వర్షాలు, వరుస తుఫాన్లు కారణంగా పత్తి, మిర్చి పంటలు దెబ్బతినడంతో రైతులు నష్టపోయారు. పత్తి పంట దిగుబడి గణనీయంగా తగ్గిపోయి ఎకరానికి 5 నుంచి 7 క్వింటాళ్లు వచ్చింది. అదే విధంగా మిర్చి పంటకు తెగుళ్లు సోకడంతో పలు గ్రామాల్లోని రైతులకు నష్టాన్ని మిగిల్చింది. అప్పుల ఊబీలో కూరకపోయిన రైతులు పత్తి, మిర్చి పంటలను తొలిగించి ఆ స్థానంలో మొక్కజొన్న పంట సాగు వైపు దృష్టి సారించారు. దీంతో ఎన్నడూలేని విధంగా ఈ యాసంగిలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. రెండేళ్ల క్రితం యాసంగిలో ఒక్క ఎకరంలో కూడా సాగు కానీ మొక్కజొన్న గతేడాది లాగే ఈ ఏడాది యాసంగిలో సుమారు 300 ఎకరాల్లో సాగు కావడం విశేషం. వెంగన్నపాలెం, జూలూరుపాడు, కాకర్ల, గుండ్లరేవు, సాయిరాంతండా, దుబ్బతండా, పడమటనర్సాపురం, కరివారిగూడెం, కొమ్ముగూడెం, మాచినేనిపేటతండా, మాచినేనిపేట, గుండెపుడి, నల్లబండబోడు, పాపకొల్లు, వినోభానగర్, తదితర గ్రామాల్లోని రైతులు నీటి వసతి ఉన్న భూముల్లో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. మొక్కజొన్న సాగుకు ఎకరానికి రూ 20 నుంచి 25 వేలు పెట్టుబడి అవుతున్నట్లు రైతులు చెపుతున్నారు. మొక్కజొన్న పంట 100-120 రోజుల్లో పంట చేతికి వస్తుందని, అదేవిధంగా ఎకరానికి పంట దిగుబడి 8 నుంచి 10 మెట్రిక్ టన్నులు వస్తుందంటున్నారు. పత్తి, మిర్చి పంటల పెట్టుబడి కోసం చేసిన అప్పులు కొంతమేర పూడ్చుకునేందుకు మొక్కజొన్న సాగు చేస్తున్నామంటున్నారు. ఖరీఫ్ సీజన్ కలిసి రాకపోయిన యాసంగిలో కలిసి రాకపోతుందా అనే ఆశతో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు.

లాభసాటిగానే ఉంది



మూడెకరాల భూమిని కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగు చేశా. సాగుకు పెట్టుబడి రూ.60 వేలు, కూలీలకు రూ.20 వేలు అయింది. ఎకరానికి ఆరు టన్నుల పంట దిగుబడి వస్తుంది. ఇప్పటి వరకు 15 టన్నుల పంట అమ్మాను. మరో 3 టన్నుల పంట చేతికొచ్చింది. పంటను విక్రయించగా రూ 1.95 లక్షలు వచ్చాయి. పత్తి, మిర్చి పంటల సాగు కంటే మొక్కజొన్న లాభసాటిగా ఉంది.

– పొరళ్ల సైదులు, కౌలు రైతు, వెంగన్నపాలెం

ఎకరంన్నరలో సాగు చేస్తున్నాం



మొక్కజొన్న పంట లాభదాయకంగా ఉండటంతో గత ఐదేళ్లగా సాగు చేస్తున్నాం. ఈ ఏడాది కౌలుకు తీసుకున్న ఒక ఎకరన్నరలో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నాం. దుక్కి దున్నడానికి, విత్తనాలు, ఎరువులు, మందులకు కలిపి ఎకరానికి రూ.25 వేలు పెట్టుబడి అయింది. ప్రస్తుతం మొక్కజొన్న సాగు ఆశాజనకంగానే ఉంది. నెల రోజుల్లో పంట చేతికి వస్తుంది.

– పొరళ్ల నరేష్, కౌలు రైతు

పత్తి తొలగించి మొక్కజొన్న వేశా



ఈ ఏడాది అధిక వర్షాలు, వరుస తుఫాన్లతో 3 ఎకరాల్లో సాగు చేసిన పత్తి పంట దెబ్బతింది. పత్తి కాయలకు పుచ్చు రావడంతో పంటను తొలగించాల్సి వచ్చింది. మొదటి దశలో వచ్చిన పత్తి తీసి అమ్మితే పెట్టుబడికి సరిపోయింది. దీంతో పత్తి పంటను తొలగించి మొక్కజొన్న సాగు చేస్తున్నాం. 3, 4 నెలల్లో మొక్కజొన్న పంట చేతికి వస్తుంది.

– చావలమడుగు రామ్మూర్తి, జూలూరుపాడు

పెరిగిన సాగు



యాసంగిలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగనుంది. మొక్క జొన్న పంట లాభదాయకంగా ఉండటంతో రైతులు మొగ్గ చూపుతున్నారు. అదేవిధంగా 100 నుంచి 120 రోజుల్లో మొక్కజొన్న పంట చేతికి వస్తుందన్నారు. యాసంగిలో మొక్కజొన్నతోపాటు వరి, మినుము, పెసర, జొన్న, కూరగాయలు సాగు కూడా రైతులు చేస్తున్నారన్నారు.

– ఎస్.రఘుదీపిక, ఏఓ, జూలూరుపాడు

మల్లన్న కల్యాణానికి తరలిరండి..



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

టేకులపల్లి: మండలంలోని కొప్పురాయి గ్రామంలో స్వయంభువుగా వెలిసిన స్వర్ణ లింగేశ్వర మల్లన్న స్వామి కల్యాణ మహోత్సవ వేడుకలకు వేలాదిగా భక్తులు తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఆలయం ప్రాంగణంలో వేడుకలకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. 17న మంగళతోరణాలు, గ్రామ దేవతల ఆరాధన, గణపతి పూజ, జ్యోతి ప్రజ్వలన, సాయంత్రం గంగ స్నానారాధన, 18న మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, అన్నాభిషేకం, తీర్థప్రసాదాలు, రాత్రి కల్యాణ వేడుకలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పటేల్ జార మంగయ్య, బొప్పన వెంకటసుబ్బారావు, భూక్య సైదులు నాయక్, మాజీ ఎంపిటిసి జార సమ్మక్క, జార హనుమంతు, కల్తి పాపారావు, భూక్య వెంకటేశ్, కొలుకూరి రవిశంకర్, మాళోతు శంకర్, దారావత్ మల్లయ్య, పూనెం నారాయణ, పిడుగు నర్సయ్య, ఈసాల రవి దొర తదితరులు పాల్గొన్నారు.

నేడు పెన్షన్ అదాలత్

ఇల్లెందు: ఇల్లెందు ఏరియాలోని సింగరేణి మాజీ ఉద్యోగులకు సీఎంపీఎఫ్ సంబంధిత సమస్యల పరిష్కారానికి సోమవారం సాయంత్రం 3 గంటలకు ఆఫీసర్స్ క్లబ్‌లో అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఏరియా జీఎం షాలమురాజు ఆదివారం ఒక ప్రటనలో తెలిపారు. ఈ అదాలత్ కార్యక్రమానికి అసిస్టెంట్ కమిషనర్ సీఎంపీఎఫ్ కొత్తగూడెం వారు హాజరవుతున్నట్లు మాజీ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

రామాలయ నిర్మాణానికి సహకరిస్తా



పూజ చేస్తున్న జెడ్పీ చైర్మన్ కనకయ్య

ఇల్లెందురూరల్: మండలంలోని చల్లసముద్రం పంచాయతీ ముకుందాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం నిర్మాణ పనులను జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య ఆదివారం పరిశీలించారు. నిర్మాణ పనుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ ధ్వజస్తంభం నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాటి చుక్కమ్మ, ఉపసర్పంచ్ కుర్ర అరుణ, ఉపసర్పంచ్ నాలవెల్లి నర్సింహారావు, ఎంపీటీసీలు మండలరాము, పూనెం సురేందర్, మడుగు సాంబమూర్తి, బొళ్ళ సూర్యం తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

టేకులపల్లి: బోడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1989-90 విద్యాసంవత్సరం పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయంగా కలుసుకున్నారు. అప్పటి హెచ్‌ఎం సామినేని సత్యనారాయణతో పాటు పేరెంట్స్ కమిటీ టీచర్లు అన్నారపు వెంకటేశ్వర్లు, తేరాల రాజేశ్వర్‌రావులను పూర్వవిద్యార్థులు ఘనంగా సన్మానించారు. అప్పటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆట పాటలతో సందడి చేశారు. పూర్వ విద్యార్థులు నరేంద్ర చారి, నాగేశ్వర్‌రావు, రామస్వామి, వీరభద్రం, గోవింద్, లక్ష్మీబాయి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కార్పెంటర్ల సమస్యలు పరిష్కరించాలి

పాల్వంచ: కార్పెంటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. ఆదివారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్ నందు ఏఐటీయూసీ అనుబంధ పట్టణ, మండల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ... తన శ్రమను నమ్ముకుని వృత్తి చేసుకుంటున్న కార్పెంటర్లపై ఫారెస్ట్ శాఖాధికారులతో దాడులు చేయిస్తు వేధింపులకు గురిచేయడం ఆపాలన్నారు. కలప డిపోల వద్ద కొనుగోలు చేసే కలపకు రాయితీలను ప్రభుత్వం ఇప్పించాలని, 50 సంవత్సరాలు నిండిన వారికి పదివేల పింఛన్, ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్ రావు, బండి నాగేశ్వరరావు, గూడెపూరి రాజు, మడుపు ఉపేంద్రాచారి, కాసర్ల రామారావు, ప్రభాకరాచారి, దుర్గా రావు, ఎం.శ్రీనివాస్‌చారి, వెంకటేశ్వర్లు, బి.రమేశ్ పాల్గొన్నారు.

భక్తులకు ట్రాఫిక్ ఇక్కట్లు



పెద్దమ్మగుడి సమీపంలోని బీసీయం జాతీయ రహదారిపై ట్రాఫిక్

- జాతీయరహదారిపై ఇష్టారాజ్యంగా వాహనాల నిలిపివేత



రోడ్డుపైనే నిలిపిన వాహనాలు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయం వద్ద బీసీయం ప్రధాన జాతీయ రహదారిపై వాహనాలను ఇష్టం వచ్చినట్లు అడదిడ్డంగా నిలిపివేయడంతో భక్తులు, వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ప్రమాదకరంగా మారింది. మండల పరిధిలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల నడుమ గల పెద్దమ్మతల్లి ఆలయానికి ఆదివారం భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. దీనికితోడు ప్రైవేట్ ఫంక్షన్‌హాల్స్ కూడా రోడ్డు పక్కనే ఉండటంతో వాహనాలను జాతీయ రహదారిపై అడ్డదిడ్డంగా నిలిపివేస్తున్నారు. దీంతో తరుచు ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనాలు, భక్తుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కనీసం ట్రాఫిక్ సమస్యను పర్యవేక్షించే పోలీసులు కూడా పరిసరాల్లో ఉండకపోవడంతో మరింత ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యలేకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

పాదయాత్ర విజయవంతంపై హర్షం



మాట్లాడుతున్న చీమల వెంకటేశ్వర్లు

ఇల్లెందు: టీపీసీసీ అధ్యక్షులు ఎ.రేవంత్‌రెడ్డి పాదయాత్ర, సభ విజయవంతం కావడంపై నియోజకవర్గం నుంచి భారీగా తరలివచ్చి విజయవంతం చేయడంపై కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఇల్లెందు జగదాంబా సెంటర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా నాయకులు చీమల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అశేషజన వాహిని తరలివచ్చి సభ, పాదయాత్ర విజయవంతం చేశారన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జలీల్‌ఖాన్, కాయం రమేష్, గొగ్గెల పాపయ్య, పట్టణ, కాంగ్రెస్ మండలాధ్యక్షులు దొడ్డా డానియేల్, పులి సైదులు, డాక్టర్ జి.రవి, డాక్టర్ బి.రామచందర్‌రావు, భూక్యా దళ్‌సింగ్‌నాయక్‌లు హర్షం వ్యక్తం చేశారు.

రేవంత్ రెడ్డిని కలిసిన నాయకులు



రేవంత్ రెడ్డిని సన్మానిస్తున్న ఎడవల్లి, తదితరులు

పాల్వంచ: హత్ సే హత్ జోడో యాత్ర కార్యాక్రమంలో భాగంగా పినపాక నియోజక వర్గం అశ్వాపురం చేరుకున్న టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డిని ఆదివారం టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. రేవంత్‌రెడ్డి యాత్రను కొత్తగూడెం నియోజక వర్గంలోను నిర్వహించాలని కోరారు. పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు, చావా వీరయ్య చౌదరి, పైడిపల్లి మనోహర్, చారి, సత్యనారాయణ, వెంకన్న, రాములు, లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

'ప్రసాద్'పై కేసు నమోదు చేయాలి

సుజాతనగర్: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై రాజద్రోహం కేసు నమోదు చేయాలని కోరుతూ అంబేడ్కర్ వాదుల ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా వేల్పుల భాస్కర్ మాట్లాడుతూ.. అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచిస్తే రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారని, ఇలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కత్తి వెంకన్న,కాకటి బాబు, భూక్యా దస్రు, కొమారి హనుమంతరావు, సమ్యద్ బాబు, కేసుపాక వెంకటేశ్వర్లు, మురిపిటి కన్నయ్య, చంటి, రాజు పాల్గొన్నారు.

పోడు సాగుదారులందరికీ పత్రాలివ్వాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, గ్రామస్తులు

టేకులపల్లి: పోడు సాగుదారులందరికీ హక్కు పత్రాలివ్వాలని, అడవిపై ఇక హక్కులు లేవని చెప్పడం కేసీఆర్ అవివేకమని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు ఆదివారం పార్టీ ఆధ్వర్యంలో బేతంపూడిస్టేజీలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశంలో 11.5 లక్షల మందికి హక్కు పత్రాలు ఇస్తామని చెబుతూనే మరో పక్క అడవిలో ఇకపై ఎవరికీ హక్కులు లేవని చెట్టు కొట్టినా, పుట్ట కొట్టినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తూనే హక్కు పత్రాలు ఇస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నో ఏళ్లుగా పోడు కొట్టుకుని సాగు చేసుకుంటున్న గిరిజనులు, గిరిజనేతరుల భూములను హరితహారం పేరుతో గర్భిణులు, ముసలివారు అని కూడా చూడకుండా జైల్లో పెట్టించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. మరోపక్క సర్వేల పేరుతో భూమిలేని వారంతా దరఖాస్తు చేసుకోవాలని అంటూనే ఇంట్లో ఉద్యోగం ఉన్నోళ్ళకు, గిరిజనేతరులకు , ఒక కుటుంబానికి పది ఎకరాలు అంటూ అనేక షరతులతో దరఖాస్తులను తిరస్కరించినటువంటి పరిస్థితి ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గుగులోత్ రాంచంద్రు, దారావత్ వెంకన్న, కల్తి నర్సయ్య, బాలు, జర్పుల మంగ్య, భూక్య శ్రీను, మాళోతు వీరు, మంగ్య పాల్గొన్నారు.

ఎన్నికలు నిర్వహించాలని సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న జేఏసీ నాయకులు

పాల్వంచ: పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ ఎన్నికల పునః నిర్వహణ సాధన జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో పర్యటించి ఇంటింటికి తిరిగి ఎన్నికల ఆవశ్యతను వివరించి సంతకాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం కన్వీనర్ చలవాది ప్రకాశ్, జేఏసీ కన్వీనర్ సయ్యద్ రషీద్, ఆరుద్ర సత్యనారాయణ, బాడిశ భిక్షం, యువతరం పార్టీ అధ్యక్షుడు పోట్రు ప్రవీణ్, సోయం కృష్ణ కుమార్, భట్టు కృష్ణ, దేవదానం, ఆంజనేయులు, జైన్, రామ్మోహన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

టేకులపల్లి: ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె.సారయ్య విమర్శించారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ... కేంద్ర ప్రభుత్వం పూర్తిగా బడా బాబులకు అనుకూలంగా ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల పేద ప్రజలకు ఎలాంటి న్యాయం జరగలేదని విమర్శించారు. విద్య, వైద్య రంగాన్ని నిర్వీర్యం చేసేలా బడ్జెట్‌లో కేటాయింపులు ఉన్నాయన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవరకొండ శంకర్,మండల కార్యదర్శి గుగులోత్ రాంచందర్ నాయక్, సహాయ కార్యదర్శులు గుగులోత్ శ్రీను, అయిత శ్రీరాములు, వాసం భద్రయ్య, మధు, నరేష్, వాసం నరేందర్, కోటి, సోని, భారతి, విజయశాంతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సారయ్య

అటెన్షన్ ప్లీజ్

రోడ్డు నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..?



ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనలో భాగంగా సుజాతనగర్ నుంచి గరీబ్‌పేట వరకు చేపట్టాల్సిన రోడ్డు నిర్మాణం నెలలు గడుస్తున్నా పూర్తికావడం లేదు. పది కిలోమీటర్ల మేరా నిర్మించనున్న ఈ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.6.36 కోట్లు మంజూరు చేయగా ఇప్పటివరకు బీటీ రహదారి నిర్మాణం మాత్రమే పూర్తయింది. సుజాతనగర్ గ్రామ పరిధిలో సుమారు 2 కి.మీ మేరా సీసీ రోడ్డు వేయాల్సి ఉంది. తహసీల్దార్ కార్యాలయం సమీపం వరకు మాత్రమే సీసీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న రహదారి నిర్మాణాన్ని కూడా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– సుజాతనగర్

ప్రశ్నించాల్సిన అధికారి : వి.సత్యనారాయణ, పంచాయతీరాజ్ డీఈ
సెల్ నంబర్ : 9866722779